# గీత కట్టూ ఇట్టూ

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్



సునంద మళ్ళీ ఒకమాటు ఉత్తరం చదివింది.

ఎన్నిమాట్లు చదివినా అవే వాక్యాలు.

"మిమ్మల్ని మా కంపెనీలో స్టెనోగా నియమించటానికి నిర్ణయించినట్లు తెలుపటాని కెంతో ఆనందిస్తున్నాము. పది రోజులలోగా వచ్చి మీరు జేరకపోవటం, మీ అసమ్మతిగా భావించి, మరొకరిని నియమించటం అనివార్యం కాగలదని గ్రహించగోరతాము...."

రేపే ఆఖరి రోజు!

ఇంటర్వ్యూకి వెళ్లేముందు, వెళ్లిన తర్వాత, ఒకప్పటి తన క్లాస్‌మేట్, ప్రస్తుతం తనని సెలక్ట్‌చేసుకున్న కంపెనీలో లేడీ సెక్రటరీ అయిన జయంతి మాటలు ఇంకా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయ్.

"చదువు, విజ్ఞానం, తెలివితేటలు— ఇవన్నీ ఉద్యోగానికి సిసలైన అర్హత లనుకుంటే శుద్ధపొరపాటు. ఆ సంగతి అయిదేళ్ల అనుభవంలో నీకు అర్థమై ఉండాలి."

"కాలేదు."

జయంతి జాలిగా నవ్వింది.

"అవును. అయిఉండదు. లేకపోతే ఆ బోడి ఆఫీసులో ఆ బట్టతల ఆఫీసరు నెలంతా గాడిదచాకిరీ చేయించుకుని, చివరకి చేతిలో పెట్టే మూడొందల రూపాయల్ని ముప్పైరోజులకి పంచుతూ బ్రతకవ్."

"తప్పదు మరి. నీకు తెలుసు— నాన్నకి పక్షవాతం."

"అవును. ఆయన మందులకోసం ఎన్నిమాట్లు నా దగ్గరకి అప్పుకోసం వచ్చావో తలుచుకుంటే, నీ పరిస్థితి క్షుణ్ణంగా అర్థమవుతుంది."

"ఏం చెయ్యను మరి? నాకున్న ఒకే ఆత్మీయురాలివి నువ్వు...."

"అందుకే నీ క్షేమంకోరి సలహా చెబుతున్నాను...."

"ఏమిటది?"

"ఆ వెధవ ఉద్యోగం మానెయ్యి."

"మానేసి!!" కనుబొమలు ఆశ్చర్యంగా పైకిలేచాయి.

"మరో ఉద్యోగంలో చేరు...."

గలగల నవ్వేసింది.

"జోక్ కాదు.... సీరియస్‌గానే చెబుతున్నాను...."

నవ్వుతూనే ఉంది.

"నువ్వు నవ్వుతున్నావు కదూ! సరే— ఈ తెల్లకాగితం మీద సంతకం పెట్టు. భయపడకు.... నీ ఆస్థి నేనేమీ దోచుకోనులే. ఇది కేవలం అప్లికేషన్‌గా వాడతాను...."

సంతకం పెట్టేసింది.

తిరుగుటపాలో జవాబులా ఇంటర్వ్యూకి పిలుపు!

ఇంద్రజాలంలో ఒక సన్నివేశంలా, ఇంద్రజాలం కూడా సిగ్గుపడేంతగా ఇంటర్వ్యూ అయిపోయింది. అక్కడి కథంతా జయంతే నడిపించింది. జయంతి మాట కెంత చలామణి ఉందో ఆ రోజే గ్రహించింది. ఆ ఆఫీసులో మకుటం లేని మహారాణిలా వెలిగిపోతోంది.

"ఇంటర్వ్యూ కేవలం ఫార్మాలిటీ. వాళ్లు నిన్ను చూడాలనుకున్నారు. చూడగానే ఒప్పుకుని తీరతారని కూడా నాకు తెలుసు...."

"ఎలా?!"

"అద్దం ఎదురుగా కూర్చుని నీ వైపు నువ్వు చూసుకో.... తెలుస్తుంది...." చిలిపిగా నవ్వింది.

అలా అనటం పరోక్షంగా తన అందానికి ప్రశంస అని తనకు తెలుసు. కానీ, అందానికీ ఉద్యోగానికీ ఏమిటి సంబంధం?

ఈ ప్రశ్నకూడా జయంతే జవాబు చెప్పింది—

"ఆడదానికి ఆ ఒక్క ప్రత్యేకతా లేకపోతే ఆత్మహత్యల సంఖ్య ఎన్నో రెట్లు పెరిగేది. నయం. దేవుడు యీ మేలయినా చేశాడు...."

జయంతి మాటలు చప్పున అర్థం కాలా.

అయోమయంగా చూస్తున్న చూపుల్ని ఖండిస్తూ, "వెర్రి ఆలోచనలతో బుర్ర పాడుచేసుకోకు. ఇంటర్వ్యూలో అపు నసుపించుకున్నాక మరి కొన్ని వివరాలు నేనే చెబుతాను" అంది.

అన్నట్లుగానే ఆ సాయంత్రం వచ్చి తనని వాళ్లింటికి లాక్కుపోయింది. తలుపుతీసి లోపలికి వెళ్లగానే అమాంతం కౌగలించుకుని "కంగ్రాట్స్! రేపే నీకు ఆర్డరు వొస్తుంది...." అంది బుగ్గమీద ముద్దిడి.

ఎంగిలి తుడుచుకుంటూ "నా కెందుకో నమ్మశక్యం కావటంలేదు" అంటున్న తన మాటలకి నవ్వి, "అవును. నువ్వే కాదు. నీ పరిస్థితిలో ఎవరున్నా నమ్మలేరు. కానీ, ఇది నిజం!" అంది జయంతి.

"సరే— నమ్ముతాను! నువ్వు ఇంటర్వ్యూ అయినాక ఏదో చెబుతానన్నావ్...."

"ఆ విషయానికే వస్తున్నాను.... ఇంతకుముందువరకు బ్రతికిన సునందకీ క్రొత్త ఉద్యోగంలో చేరిన సునందకీ ఎక్కడా పోలికలు ఉండకూడదు.."

"అంటే?"

"నీ జీతం పన్నెండొందలు!"

"నిజంగా?!"

"అందులో మూడొందలు స్పెషల్ అలవెన్సుగా ఇవ్వబడుతుంది."

"ఏమిటో ఆ స్పెషాలిటీ...."

"ఎప్పుడూ విరబూసిన పువ్వులా నవ్వుతూ, పరిమళాలు వెదజల్లుతూ ఆకర్షణీయంగా ఉండటం!"

"అంటే?"

"మరీ చాదస్తంగా ప్రశ్నలు వెయ్యకు. నువ్వు పనిచెయ్యబోయేది మానేజింగ్ డైరెక్టర్ పవన్‌కుమార్ దగ్గర..."

"అయితే?"

"కంపెనీలో ఆయన మాటకి తిరుగు లేదు. ఆయన మూడ్స్‌నిబట్టి మసలుకోవటం అవసరం."

"మూడ్స్ అంటే?"

"చాదస్తం వద్దన్నాను. ముష్టి మూడొందల ఉద్యోగం నుండీ పన్నెండొందల రూపాయల ఉద్యోగానికి ఎదిగాక, అందుకు తగినట్టుగా ప్రవర్తించటం మనకే మంచిది."

"అర్థమయింది...."

"చాలు. అదే నేను కోరేది! ఇక ఆ విషయం ఎత్తకు."

"తప్పని తెలిసీ చెయ్యటం, నిప్పని తెలిసీ ముట్టుకోవటం నేను చెయ్యలేని పని జయంతీ!"

"ఒప్పని తెలిసి చేస్తూ, నిప్పుకాదని ముట్టుకుంటూ ఇంతవరకూ జీవితంలో ఏం బావుకున్నావ్ అశాంతి కాక?"

మౌనం.

"ఏం చెప్పగలవ్! చెప్పలేవు. కాబట్టి నోరు మూసుకుని నేను చెప్పినట్టు చెయ్యి. పెద్దవాళ్లెప్పుడో చెప్పారు, బాగుపడదలుచుకుంటే తనకి తోచనప్పుడు ఇంకెవరయినా చెబుతేనైనా వినాలని...."

మౌనం.

"బాగా ఆలోచించు. నీకు పదిరోజుల టైము మాత్రమే ఇస్తారు." ఆ తర్వాత .... నవ్వి "కాలం వెనక్కి రాదు! ఆ బోడి ఆఫీసూ, బట్టతల ఆఫీసరు తిట్లూ, మూడొందలతో ముప్పైరోజుల్ని కొనుక్కోవటం, ఋతుపవనాలకి శరీరాన్ని అంకితంచేసి, వయసుని నైవేద్యం పెట్టెయ్యడం, మళ్లీ— అదే జీవితం.... అదే కథ...." జయంతి ముగించింది.

తను మాత్రం నవ్వలేకపోయింది.

లేచి వచ్చేసింది.

వచ్చినది మొదలు ఏ పనిచేస్తున్నా ఒకే ఆలోచన!

ఏం చేస్తే బావుంటుంది?— అవకాశం జారిపోతే ఎలా వెనక్కి రాదో ఒక్క అడుగు ముందుకి వేస్తే అలాగే మళ్లీ వెనక్కి రావటం కూడా అసాధ్యం.

జయంతి చెప్పిన జీవితానికి, తను బ్రతుకుతున్న జీవితానికీ మధ్య సన్నని ఎర్రగీత రెండిటినీ వేరుచేస్తున్నట్టు కనిపించింది.

అటా — ఇటా?

గీతమీద నిలబడి ఆలోచిస్తోంది, సునంద.

రేపే చివరిరోజు.

జయంతికి తన నిర్ణయం చెప్పాల్సింది రేపే!

* * *

సునంద 'కాలింగ్ బెల్' నొక్కింది.

"గడియ తీసేఉంది—లోపలికిరా...."

తలుపు నెట్టుకుని వెళ్లింది.

చదువుతున్న నవల పక్కన పడేసి "కూర్చో" అంది జయంతి.

సునంద కూర్చుంటూ, సూటిగా జయంతి మొహంలోకి చూసి నవ్వటానికి ప్రయత్నించింది.

"ఉద్యోగంలో జేరటానికే నిర్ణయించుకున్నా వన్నమాట?" ఆమె నవ్వు వెనక భావాలు చదువుతూ అడిగింది జయంతి.

"ఎలా ఊహించావ్?!"

"నో వండర్! నీ వాలకమే చెప్పింది ...."

"నువ్వు నిజంగా రచయిత్రివి కావాల్సింది...."

"పాఠకుల్ని దేవుడు రక్షించు గాక! అలాంటి శాపాలు ఇవ్వకు.... బైదిబై .... విషయం కాస్త సీరియస్. అందుకని జోకులు మానేద్దాం...."

"సీరియస్సా?"

"అవును! కుర్చీ గట్టిగా పట్టుక్కూర్చుని విను. తీరా విన్నాక ధామ్మని పడిపోతే నా దగ్గర స్మెల్లింగ్ సాల్ట్ కూడా లేదు— ఇంతకీ నీకు బి.పి; గుండెజబ్బు, నరాల బలహీనత వగైరా రోగాలు లేవు కదా?"

"అలా ఏమీ లేవని డాక్టరు సర్టిఫికేట్ కూడా ఇవ్వాలా రేపు?" అమాయకంగా అడిగింది.

"రేపు కాదు— ఇప్పుడు!"

"డోంట్ బి సిల్లీ.... విషయం ఏమిటో సరిగ్గా చెప్పు...."

"నీకు ఉద్యోగం ఇవ్వరాదని ఎమ్.డీ. నిర్ణయించారు."

కరంట్ షాక్ తగిలినట్లయి "రియల్లీ!!" అంది దాదాపు అరుస్తూ.

"అందుకే చెప్పాను.... ఆరోగ్యం జాగ్రత్త అని...."

"సరిగా చెప్పు జయంతీ! తొమ్మిది రోజుల మానసిక సంఘర్షణ తర్వాత, నాన్నని ఈ చివరి రోజుల్లో దయనీయంగా చూడలేక యీ నిర్ణయానికి వచ్చాను. ప్లీజ్. తమాషాచేసి నా మనసుని చిత్రవధ చెయ్యకు...."

"చెబుతాను. కానీ, నేను పూర్తిగా చెప్పేవరకు మధ్యలో ప్రశ్నలు వెయ్యకూడదు...."

"అలాగే...."

"ఆడదానికి అందం శాపమూ, వరమూ కూడా సునందా! ఈ సత్యం ఉద్యోగంలో జేరిన మూడోరోజునే గ్రహించాను. నయం. నీకు పదిరోజులైనా గడువిచ్చారు. నాకు కేవలం మూడు రోజులు. అంతే. ఆలోగా నా నిర్ణయం అనుకూలం కాకపోతే, ఉద్యోగానికి వీడ్కోలు చెప్పాలి.

"నేను ఉద్యోగం తప్పనిసరిగా చెయ్యటానికి గల పరిస్థితులు నీ పరిస్థితులకంటే చాలా చాలా ఘోరం. వద్దు. అవన్నీ ఇప్పుడు తలుచుకోలేను. జీవితంలో గెలవాలి. పరిస్థితుల ప్రాబల్యాన్ని ఏదో విధంగా జయించాలి. బీదరికం మీద కసి తీర్చుకోవాలి. డబ్బు ఇరుసుమీద విలాసంగా తిరిగే యీ ప్రపంచంలో నేనూ ఒక బలమైన జీవిగా మనుగడ సాగించాలి. ఈ తపనే నన్ను మార్చేసింది. ఆ ఆవేశం కలిగించిన నిషాలో అన్నీ మర్చిపోయేను.

"ఉద్యోగంలో నిలదొక్కుకున్నాను. ఎమ్.డీ.ని నా కనుసన్నలలో ఉంచుకోగలిగాను. అందుకే అన్నాను— ఆడదాని అందం సంగతి! నిజం చెబుతున్నాను— ముందుగా నన్ను క్షమించు సునందా! నేను నీకు సాయంచెయ్యాలని ఈ ఉద్యోగానికి ప్రోత్సహించలేదు. ఆగు. అలా ఆశ్చర్యంగా చూస్తూ, ప్రశ్నలు అడగటం ప్రారంభించకు. ముందే చెప్పాను. చివరిదాకా మాట్లాడొద్దని. విను. అంతే. నోరు మెదపవద్దు.... దట్స్ గుడ్!

"ఎమ్.డి. పవన్‌కుమార్‌కి కోట్ల రూపాయల ఆస్థి ఉంది. అలాంటివాళ్ళ మనసుల్లో మెదిలే భావాలు చదివితే చాలా ఆశ్చర్యం వేస్తుంది. వాళ్ళకి ఏదీ కొదవలేదు. డబ్బు వాళ్ళ ట్రంప్‌కార్డు! ఎలాంటి ఆటయినా ఇట్టే గెలవొచ్చని వాళ్ళ అనుభవాలు చెబుతుంటాయి. మనుషులతో, మనసులతో ఆడుకోవటం గొప్ప హాబీ వాళ్ళకి.

"నీకు సాయం చెయ్యటానికి ఉద్యోగం ఇప్పించటం లేదన్నాను కదూ? అవును. కేవలం నా ఉద్యోగం కాపాడుకోవటానికి— ఇంకా చెప్పాలంటే పవన్ కుమార్ డర్టీగేమ్‌లో మరో పావుగా నిన్ను ఇరికించటానికి మాత్రమే ఇదంతా చేసాను. అప్పుడే కోపంతో అరిచెయ్యకు. ఇంకా చెప్పాల్సింది ఉంది.

"పవన్‌కుమార్ నిన్ను చూశాడు. చూసిన క్షణం ఎలాంటిదో తెలియదు. ఈ తొమ్మిది రోజులూ నీ గురించి వేలాది ప్రశ్నలు వేసి నన్ను చంపేశాడు. కారణం నిన్ననే అర్థమయింది. అది కూడ, బహుశః నువ్వీ ఉద్యోగంలో జేరవేమోనని నేను సంశయంగా చెప్పాక బయటపెట్టాడు. నాకు చాలా అసూయ కలిగింది సునందా!"

"ఎందుకని?" సస్పెన్సు తట్టుకోలేక అడిగేసింది.

"అతను నిన్ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడు!"

"వాట్?" బిగ్గరగా అరిచింది సునంద.

"యస్"— అంది చాలా ప్రశాంతంగా జయంతి.

ఒక అయిదునిముషాల దాకా— అక్కడ మనుషులెవరూ లేరన్నంత నిశ్శబ్దం.

జయంతే నోరు విప్పింది—

"ఈ పెళ్లికి నీ కేమైనా అభ్యంతరాలుంటే చెప్పు సునందా!"

మౌనం....

"నువ్వే కాదు. ఈ అవకాశాన్ని ఎవరూ వదులుకోలేరు. నాకు తెలుసా సంగతి...."

సునంద సూటిగా జయంతి కళ్ళలోకి చూస్తూ—

"అతను నిన్నే ఎందుకు పెళ్లిచేసుకోవటం లేదు?" అని ప్రశ్నించింది.

"వెరీ సింపుల్! నేను పవన్ కుమార్‌కి అతి సులభంగా— ముచ్చటగా

మూడురోజుల గేమ్‌లో దొరికిపోయాను గనుక."

"ఆ మాటకొస్తే నేనూ ఏదోరోజున..."

"ఆ సంగతి పవన్‌కుమార్‌కి తెలిస్తే కదా?"

నిట్టూర్చింది సునంద. ఆమె మొహం చూస్తే మానసికంగా పూర్తిగా అలిసి పోయినట్లుంది.

"ఈ అనుభవం తర్వాత, అసలు మనుష్యులు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారో అర్థమయ్యింది."

"ఎందుకు చేసుకుంటారు?"

"ఎందుకిలా మా మనసులు చిత్రవధ చేస్తూ జీవితాలతో ఆడుకుంటావని దేవుణ్ణి నా జీవితం మరింత అపహాస్యం కాదూ?"

"చాలా తెలివితక్కువగా ఆలోచిస్తున్నావ్."

"అవునేమో...." కుర్చీలో వెనక్కి వాలుతూ అంది సునంద.

"పవన్‌కుమార్‌లాంటి కోటీశ్వరుడు కోరి మరీ నిన్ను పెళ్లిచేసుకుంటానంటే...."

"నోబుల్ బహుమతి తిరస్కరించినట్లు వద్దంటావేమిటంటావ్? అందులోనే ఉంది ఘనత, గౌరవం. కానీ, నేను పవన్‌కుమార్‌ని తిరస్కరించటం అందుకోసం కాదు. నువ్వన్నావ్ గుర్తుందా? డబ్బు వాళ్ళ ట్రంప్‌కార్డు అనీ, ఏ ఆట



అడగటానికి?"

"కొంపదీసి నువ్విప్పుడు ఆత్మహత్య చేసుకోబోవటం లేదుకదా?"

"నా కంత ధైర్యం లేదు!"

"ఇంతకీ నీ నిర్ణయం ఏమిటి?"

"అదే చెప్పలేకపోతున్నాను. ఇక్కడికి వచ్చేవరకు ఉద్యోగంలో జేరాలనుకున్నాను. కాదు పెళ్లంటున్నావ్. ఇదంతా ఇంద్రజాలంలా ఉంది. ఒక్కమాటుగా నన్ను అయోమయంలోకి పడదోసాయివన్నీ, ఆ పవన్‌కుమార్‌కి పెళ్లి కూడా ఒక గేమ్‌లాంటిదేనేమో! అప్పుడుయినా గెలవొచ్చునేది వాళ్ళ అనుభవమనీ. అది అబద్ధమనీ, వాళ్లూ ఓటమి చవి చూడక తప్పదని ఋజువుచెయ్యాలంటే ఇన్నాళ్లూ నీలాంటి నిస్సహాయురాళ్లని పావులుగా వాడుకున్న కుటిలత్వాన్ని కూలదొయ్యాలంటే- ఇలాంటి అవకాశం వదులుకోకూడదు! చెప్పు జయంతీ. ఆ డర్టీరోగ్ సిగ్గుపడి చచ్చేలాగా, వాడి నరాలు పట్టుతప్పేలా, వాడి అహం ఆత్మహత్య చేసుకునేలాగా, నీకున్న భాషాజ్ఞానమంతా వెచ్చించి, కత్తులు దించుతున్నట్లు మరీ చెప్పు. ఆఫ్టరాల్, ఒక మామూలు ఆడది సునంద- నిన్ను పెళ్లాడటానికి నిరాకరించిందని చెప్పు..."

కుర్చీలోంచి లేచింది సునంద. తనకేసి వింతగా చూస్తున్న జయంతికేసి నవ్వుతూ చూసి "అయామ్ ఆల్‌రైట్! నాకు పిచ్చెక్కలేదు. రేపట్నుంచీ మళ్లీ అదే బోడి ఆఫీసు, బట్టతల ఆఫీసరూ, అదే రొటీను! వస్తా....గుడ్‌బై...." అవెళ్లోయింది తీవిగా.

*